## క్లుప్తంగా

### ప్రభుత్వ బడుల్లో డిజిటల్ బోధన



వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): ప్రభుత్వ బడుల్లో అత్యాధునిక వసతులతో డిజిటల్ తరగతి గదుల్లో విద్యాబోధన చేయడం జరుగుతుందని మండల విద్యాశాఖాధికారి జి. సత్యనారాయణమూర్తి అన్నారు. అనంతవరప్పాడు ఆర్‌బీఆర్ ప్రాథమిక పాఠశాలను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు, విద్యా నైపుణ్యాలను పరిశీలించారు. జగనన్న గోరుముద్ద పథకం అమలు పక్కాగా ఉండాలని ఆదేశించారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

### డయాలసిస్ పేషెంట్‌కు పింఛను మంజూరు



పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): రాష్ట్ర ప్రభుత్వం పింఛన్ల మంజూరులో వివక్షకు తావులేకుండా పారదర్శకంగా మంజూరు చేస్తోందని మాజీ ఎంపీటీసీ మన్నవ మహేంద్రబాబు అన్నారు. పెదగొట్టిపాడు ఆది ఆంధ్రా కాలనీకి చెందిన పల్లపాటి మత్తయ్య గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ డయాలసిస్ చేయించుకుంటున్నాడు. కొద్దిరోజుల కిందట డయాలసిస్ పింఛనుకు దరఖాస్తు చేసుకున్నాడు. ప్రభుత్వం ఈ నెల పింఛను మంజూరు చేసింది. మాజీ ఎంపీటీసీ మహేంద్ర, వెల్ఫేర్ అసిస్టెంట్ కీర్తన, వలంటీర్ ప్రవీణ మంగళవారం సాయంత్రం మత్తయ్యకు పింఛను నగదు రూ.10 వేల రూపాయలను అందించారు.

### ధ్యానం సర్వరోగ నివారిణి



కాకుమాను: ధ్యానం సర్వరోగ నివారిణి అని సీనియర్ పిరమిడ్ మాస్టర్ అంజలి అన్నారు. గురు పౌర్ణమి సందర్భంగా స్థానిక శ్రీ ఆత్మ లక్ష్మి ధ్యాన మందిరంలో నిర్వాహకుడు రాంబాబు ఆధ్వర్యంలో మంగళవారం ప్రత్యేక ధ్యాన శిబిరం నిర్వహించారు. సీనియర్ నిపుణులు అంజలి మాట్లాడుతూ రోజూ ధ్యానం చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ధ్యాన మందిరంలో ఉదయం, సాయంత్రం అనుభవజ్ఞులతో ఉచితంగా ధ్యానం చేయించడం జరుగుతుందని తెలిపారు.

### మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



కాకుమాను: ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం మెనూ తప్పనిసరిగా పాటించాలని ఎంఈఓ కేఎఫ్ కెనడీ అన్నారు. కాకుమాను ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని మంగళవారం ఎంఈఓ పరిశీలించారు. మారిన మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని ఆయన ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి, పలు రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీరామమూర్తి, ఉపాధ్యాయులు ఉన్నారు.

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



పెదకాకాని: ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ ప్రతినిధి కొండపల్లి సాల్మన్ పాల్ అన్నారు. పెదకాకాని జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆన్‌లైన్ మోసాలు, సైబర్ నేరాలపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రతినిధి పి.సరిత, సచివాలయం మహిళా పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# 'జగనన్న సురక్ష'తో సమస్యలకు తక్షణ పరిష్కారం

**ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య**



కొప్పురావూరులో ధృవపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య

పెదకాకాని: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. మంగళవారం మండలంలోని కొప్పురావూరు, వెనిగండ్ల సచివాలయాల్లో శిబిరాలు నిర్వహించారు. కొప్పురావూరులో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య పాల్గొని, ధృవపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ప్రభుత్వం ఇప్పటికే 99 శాతం ప్రజలకు సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూర్చడం జరిగిందన్నారు. సాంకేతిక కారణాలతో అర్హత కలిగి లబ్ధి చేకూరని వారి కోసం జగనన్న సురక్ష కార్యక్రమం ప్రారంభించడం జరిగిందన్నారు. కొప్పురావూరు గ్రామంలో 340 మందికి, వెనిగండ్ల గ్రామంలో 313 మందికి వివిధ ధృవీకరణ పత్రాలు మంజూరు చేశారు. ఎంపీడీవో బీబీ మల్లేశ్వరరావు, తహసీల్దారు పి.రత్నం, ఎంపీపీ టీ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ గోళ్ళ జ్యోతి, సర్పంచులు ఆలా సాంబశివరావు, వేల్పుల శ్రావణి, వైస్ ఎంపీపీ కామినేని శ్రీనివాసరావు, ఏఓ పి.సంధ్యారాణి, పీఆర్ ఏఈ జగదీష్, ఎంపీటీసీ మున్నంగి నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

**'జగనన్న సురక్ష' పేదలకు వరం**

గుంటూరు రూరల్: చిన్నపలకలూరు గ్రామంలో జగనన్న సురక్ష శిబిరాన్ని మంగళవారం నిర్వహించారు. జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు పాల్గొని, దరఖాస్తుదారులకు ధృవపత్రాలు అందజేశారు. ఎంపీడీవో శోభరాణి చిన్నపలకలూరు, దాసుపాలెంలో నిర్వహించిన శిబిరాల్లో పాల్గొన్నారు. 303 ధృవపత్రాలను అందజేశారు. వాటిలో 100 మందికి కులధృవీకరణ, 155 మందికి ఆదాయ ధృవీకరణ పత్రాలు, 35 మందికి ఆధార్ సేవలు, 36 మందికి ఇతర సేవలు అందించటం జరిగిందన్నారు. గ్రామ ప్రత్యేక అధికారి కె.శ్రీనివాసరావు, మండల ప్రత్యేక అధికారి వజ్రశ్రీ, ఏఓ ఐ.సుబ్రమణ్యం, డీటీ బిట్టు రమేష్, పంచాయతీ రాజ్ ఏఈ శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఆలపాటి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

**సర్వీసు చార్జి లేకుండా సర్టిఫికెట్లు జారీ**

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): సురక్ష కార్యక్రమంలో సర్వీసు ఛార్జి లేకుండా సర్టిఫికెట్లను జారీ చేయడం జరుగుతుందని వట్టిచెరుకూరు ఎంపీడీవో జి. శేషగిరిరావు అన్నారు. మండల పరిధిలోని సాపాడు, చమళ్లమూడి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. టోకెన్లు జారీ చేసిన వారికి సంబంధించిన ధృవీకరణ పత్రాలను లబ్ధిదారులకు ఉచితంగా అందించారు. కార్యక్రమంలో మండలస్థాయి అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు అందజేస్తున్న జెడ్పీటీసీ తుమ్మల

**అర్హులందరికీ సంక్షేమ ఫలాలు: జేసీ రాజకుమారి**

చేబ్రోలు: అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందించటమే జగనన్న సురక్ష శిబిరాల ముఖ్య ఉద్దేశమని జాయింట్ కలెక్టర్ రాజకుమారి అన్నారు. చేబ్రోలు-1 గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్ష శిబిరం జరిగింది. జేసీ రాజకుమారి శిబిరాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. హౌస్ హోల్డ్ సర్వేలో టోకెన్ జనరేట్ చేసిన దరఖాస్తుదారులకు వివిధ రకాల 235 సర్టిఫికెట్లను అధికారులు అందజేశారు. జటిలమైన సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించాలని జేసీ అధికారులకు సూచించారు. అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ, మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి, తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావు, గ్రామ సర్పంచ్ వినీతారాణి, పీఎస్ శ్రీనివాసరావు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.



సర్టిఫికెట్ అందజేస్తున్న జేసీ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణ శర్మ

**సమస్యల పరిష్కారానికే జగనన్న 'సురక్ష'**

చేబ్రోలు: చేబ్రోలు-2 గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న సురక్షా శిబిరం జరిగింది. 242మందికి వివిధ ధృవీకరణ పత్రాలను అందజేశారు. తహసీల్దారు కేవీ గోపాలకృష్ణ, స్పెషల్ ఆఫీసర్ పల్లవి పాల్గొన్నారు. ఎంపీడీవో బి బాబురావు, గ్రామ సర్పంచ్ పి.వినీతారాణి, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, ఎంపీటీసీ ఆదాం, కె.కిరణ్, సుబాని తదితరులు పాల్గొన్నారు.





సర్వీస్ రిక్వెస్ట్ డెస్క్





జగనన్నకు చెబుదాం డెస్క్

## • స్పెషల్ డెస్క్‌లతో పరిష్కారం స్పీడ్‌గా..

ప్రత్తిపాడు: 'జగనన్న సురక్ష'పై ప్రభుత్వం ప్రత్యేక ఫోకస్ పెట్టింది. సురక్ష క్యాంపుల్లో లబ్ధిదారులకు వేగంగా సులభంగా, ఉచితంగా అక్కడికక్కడే సర్టిఫికెట్లు మంజూరు చేసే విధంగా స్పెషల్ డెస్క్‌లను ఏర్పాటు చేస్తోంది. క్యాంపు జరిగే చోట రిజిస్ట్రేషన్ డెస్క్, వెరిఫికేషన్ డెస్క్, సర్వీస్ రిక్వెస్ట్ డెస్క్, సర్టిఫికేషన్ డిస్ట్రిబ్యూషన్ డెస్క్, హెల్త్ డెస్క్, ఆధార్ క్యాంప్ డెస్క్, జగనన్నకు చెబుదాం డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నారు. అక్కడికక్కడే ప్రజలు తమ సమస్యలపై అర్జీ రిజిస్టర్ చేసుకోవడం, వెరిఫికేషన్, టోకెన్ నంబర్ రావడం, సర్టిఫికెట్ తీసుకోవడం అంతా నిమిషాల వ్యవధిలో జరిగిపోతోంది. ఈ చిత్రాలు మంగళవారం తిక్కిరెడ్డిపాలెంలో జరిగిన జగనన్న సురక్ష క్యాంపులో కనిపించాయి.



సర్టిఫికెట్ల డిస్ట్రిబ్యూషన్ డెస్క్





రిజిస్ట్రేషన్ డెస్క్

# మన్యం వీరుడు అల్లూరికి ఘన నివాళి

గుంటూరు రూరల్: అల్లూరి సీతారామరాజు జయంతిని మంగళవారం నగర శివారులోని లాం ఫాం నందున్న ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో నిర్వహించారు. అల్లూరి చిత్రపటానికి ఉపకులపతి ఆచార్య డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు.ఆచార్య విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. గిరిజన రైతులు పడుతున్న ఇబ్బందులపై బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా అల్లూరి పోరాటం చేశారన్నారు. జిల్లాల పునర్విభజనలో భాగంగా అల్లూరి జిల్లాలో వ్యవసాయంలో నూతన సాంకేతికత విస్తరణ కోసం ఏరువాక కేంద్రాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు. విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు, పరిశోధన సంచాలకురాలు డాక్టర్ ఎల్.ప్రశాంతి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.సుధాకర్, విస్తరణ సంచాలకులు డాక్టర్ ఎ.సుబ్బరామిరెడ్డి, డీన్ డాక్టర్ ఎ.మణి, సామాజిక విజ్ఞాన శాస్త్ర పీఠాధిపతి డాక్టర్ సీహెచ్ చిరంజీవి, విద్యార్థి కార్యకలాపాల డీన్ డాక్టర్ పీ సాంబశివరావు, కంప్ట్రోలర్ డాక్టర్ ఏవీ రమణ పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వీసీ డాక్టర్ ఎ.విష్ణువర్ధన్‌రెడ్డి

**ఎంపీడీఓ కార్యాలయంలో..**

పెదనందిపాడు: అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఎంపీడీవో కార్యాలయంలో ఆయన చిత్రపటానికి ఎంపీపీ టి.హెప్సిబా, అధికారులు పూలమాలలు వేసి, ఘన నివాళులర్పించారు. ఎంపీడీవో రాజగోపాల్, ఈవోపీఆర్డీ కె.సాయిలీల, ప్రత్తిపాడు మార్కెట్‌యార్డు డైరెక్టర్ షేక్ ఖాశీంపీరా, సర్పంచ్ దాసరి పద్మారావు, ఉప సర్పంచ్ దివి రాంబాబు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తహసీల్దారు కార్యాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి తహసీల్దారు సుభాని పూలమాల వేసి నివాళులర్పించారు. సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.



అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ, ఎంపీడీవో

**అల్లూరికి ఘన నివాళి**

చేబ్రోలు: స్థానిక గ్రామ సచివాలయంలో అల్లూరి సీతారామరాజు చిత్ర పటానికి పలువురు అధికారులు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. జేసీ రాజకుమారి, అసిస్టెంట్ కలెక్టర్ శివన్నారాయణశర్మ, మండల స్పెషల్ ఆఫీసర్ పల్లవి, తహసీల్దారు గోపాలకృష్ణ, ఎంపీడీవో బి.బాబురావు, గ్రామ సర్పంచ్ పి.వినీతారాణి, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.





అల్లూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జేసీ, అసిస్టెంట్ కలెక్టర్

### 7న డిగ్రీ విద్యావిధానంపై అవగాహనా సదస్సు

గుంటూరు రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది నుంచి బీఎస్సీ, బీసీఏ డిగ్రీ కోర్సుల్లో ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానంపై ప్రత్యేక అవగాహనా సదస్సును ఈ నెల 7న నిర్వహించనున్నట్లు విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి.అనురాధ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందస్సును పలకలూరు రోడ్‌లోని, విజ్ఞాన్ డిగ్రీ, పీజీ కళాశాలల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ కార్యక్రమంలో పాల్గొని, సందేహాలను నివృత్తి చేసుకోవచ్చన్నారు. వివరాలకు 98663 99808 సంప్రదించాలని తెలిపారు.

### సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలని గొట్టిపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీకాంత్ అన్నారు. గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆశా డే సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ జూలై డెంగీ మాసమని చెప్పారు. గ్రామాల్లో ర్యాలీలు, అవగాహన కార్యక్రమాలతో ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. ఎంపీహెచ్ఈవో చెల్లమ్మ మాట్లాడుతూ సర్వేలను పక్కాగా నిర్వహించాలన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో గ్రామాల్లో మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆశా నోడల్ ఆఫీసర్ నిర్మల మాట్లాడుతూ ప్రతి రోజూ ఆశా కార్యకర్తలు కిల్కారీ యాప్ ద్వారా 14423 నంబరుకు కాల్ చేసి రోగి వివరాలను తెలియజేయాలన్నారు. సమావేశంలో ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్యను పరిష్కరించండి



డీపీవోకు గ్రామ సమస్యలు చెబుతున్న స్థానికులు

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): గ్రామాల్లోని తాగునీటి సమస్యలను పరిష్కరించాలని తిక్కిరెడ్డిపాలెం, నిమ్మగడ్డవారిపాలెం గ్రామాల ప్రజలు, నాయకులు డీపీవో కేశవరెడ్డిని కోరారు. తిక్కిరెడ్డిపాలెం సచివాలయం వద్ద మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో వివిధ రకాల ధృవీకరణ పత్రాలకు సంబంధించి మొత్తం 280 టోకెన్లు రాగా 250 టోకెన్లుకు సర్టిఫికెట్లను డీపీవో, ఎంపీడీవోలు ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా అందజేశారు. కాగా మిగిలిన ముప్పై ఆధార్‌కు సంబంధించిన సర్వీసులు రావడంతో వాటినీ పరిష్కరించారు. తిక్కిరెడ్డిపాలెం రక్షిత మంచినీటి చెరువులో నిత్యం గేదెలు దిగి నీటిని కలుషితం చేస్తున్నాయని ఎస్సీ కాలనీకి చెందిన అనిల్‌తో పాటు పలువురు స్థానికులు డీపీవో దృష్టికి తీసుకువెళ్లారు. బొర్రావారిపాలెంలో మైక్రోవాటర్ ఫిల్టర్ నిర్మించినప్పటికీ గ్రామస్తులకు నీటి కష్టాలు తప్పడంలేదని ఆ గ్రామ మాజీ సర్పంచ్ చెర్లోపల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. నిమ్మగడ్డవారిపాలెం గ్రామానికి జలజీవన్ మిషన్ కింద రూ. 25 లక్షల నిధులు మంజూరైనప్పటికీ, నేటి వరకు గ్రామంలో ఒక్కటంటే ఒక్క పని కూడా మొదలు పెట్టలేదని, వెంటనే పనులు మొదలయ్యేలా చూడాలని ఆ గ్రామ పార్టీ నాయకుడు నిమ్మగడ్డ సతీష్ డీపీవోను కోరారు. పై అంశాలపై సానుకూలంగా స్పందించిన డీపీవో కేశవరెడ్డి సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

# పేదల పాలిటి పెన్నిధి వంగవీటి

గుంటూరు రూరల్: పేదల పాలిటి పెన్నిధి, కార్మిక నాయకుడు వంగవీటి మోహనరంగా అని జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. మంగళవారం చిన్నపలకలూరు గ్రామంలో వంగవీటి మోహన రంగా జయంతిని నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంద్ర, తంగెళ్ళ నాగేశ్వరరావు, ఎం.వెంకటేశ్వర్లు, బి చిన్నపోతురాజు, పి.శ్రీనివాసరావు, కె.శ్రీను, డి.శ్రీనివాసరావు, బి.భాస్కర్, అనిల్‌కుమార్, బాజీ, నరేష్, అంకమ్మరావు పాల్గొన్నారు.



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న జెడ్పీటీసీ తుమ్మల

**ముట్లూరులో వంగవీటి జయంతి**

వట్టిచెరుకూరు (ప్రత్తిపాడు): వట్టిచెరుకూరు మండలం ముట్లూరులో మంగళవారం రాత్రి వంగవీటి మోహనరంగా 76వ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేడుకల్లో కాపు నాయకులు రంగా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పి.భవన్నారాయణ, కె.వెంకటేశ్వరరావు, బి.శ్రీనివాసరావు, పి.బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి**

పెదకాకాని: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వంగవీటి మోహన్ రంగ అని ఎంపీపీ తుళ్ళిమిల్లి శ్రీనివాసరావు అన్నారు. వెంకట కృష్ణాపురం గ్రామంలో వంగవీటి మోహన్ రంగ జయంతి కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పెదకాకాని సెంటర్లో వంగవీటి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం 25 మంది యువకులు రక్తదానం చేశారు.



రక్తదానం చేస్తున్న అభిమానులు

# పంచాయతీకి చేరిన 'క్యాష్ బుక్'

సాక్షి ఎఫెక్ట్

ప్రత్తిపాడు: క్యాష్ బుక్ ఎట్టకేలకు పంచాయతీ కార్యాలయానికి చేరింది. గొట్టిపాడు పంచాయతీ కార్యాలయంలోని రికార్డు రూమ్‌లో భద్రంగా ఉండాల్సిన అత్యంత కీలకమైన క్యాష్ బుక్ సస్పెన్షన్‌కు సిఫారసు చేసిన ఓ గ్రేడ్-1 కార్యదర్శికి చేరిందంటూ మంగళవారం 'పంచాయతీ క్యాష్ బుక్‌కు కాళ్లు..?' శీర్షికన కథనం ప్రచురితమైన సంగతి తెలిసిందే. విషయాన్ని జిల్లా పంచాయతీ అధికారి ఆర్ కేశవరెడ్డి సీరియస్‌గా పరిగణించారు. క్యాష్‌బుక్ అంశాన్ని పరిశీలించాలని ఈవోపీఆర్డీ మావులూరి మోషెను ఆదేశించారు. ఆయన క్యాష్ బుక్ బయటకు వెళ్లడంపై ఆరా తీశారు. పంచాయతీ గుమస్తానే క్యాష్ బుక్‌ను గ్రేడ్-1 సెక్రటరీకి ఇచ్చినట్లు ఒప్పుకోవడంతో, వెంటనే క్యాష్ బుక్‌ను పంచాయతీకి చేర్చాలని ఆదేశించారు. ఈ మేరకు పంచాయతీ గుమస్తా నుంచి లిఖితపూర్వక వివరణ తీసుకున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో క్యాష్‌బుక్ పంచాయతీకి చేరిందని ఇన్‌చార్జి సెక్రటరీ జాన్ పీరా తెలిపారు.



గొట్టిపాడు పంచాయతీకి చేరిన క్యాష్‌బుక్

# చదువుతోనే జీవితంలో ఉన్నతమైన మార్పులు

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): చదువుతోనే జీవితాల్లో ఉన్నతమైన మార్పులు చోటుచేసుకుంటాయని మండల స్పెషల్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.కేశవరెడ్డి అన్నారు. తిక్కిరెడ్డిపాలెంలో పదవ తరగతి చదివిన పదిహేను సంవత్సరాల బాలికకు వివాహం చేసేందుకు తల్లిదండ్రులు ప్రయత్నిస్తున్నారంటూ ఐసీడీఎస్ అధికారులకు సమాచారం అందడంతో గత నెల 15న ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో వి. సుజాతదేవి, సీఐ ఎం.వి సుబ్బారావు, ఎంపీడీవో శ్రీరమ్య, ఎస్ఐ రవీంద్రబాబు, ఏపీఎం సురేష్‌కుమార్ బాలిక నివాసానికి వెళ్లి, తల్లికి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఐసీడీఎస్ అధికారులు బాలికను ఉన్నత చదువులు చదివించేందుకు నాగార్జునసాగర్‌లోని రెసిడెన్షియల్ కళాశాలలో సీటు ఇప్పించారు. కళాశాలలో చేర్పించమని ఐసీడీఎస్ అధికారులు తల్లిని అడుగుతున్నా ఫలితం లేకపోయింది. దీంతో మంగళవారం మధ్యాహ్నం డీపీవో, సీడీపీవో, ఏసీడీపీవో, సర్పంచ్‌లు బాలిక నివాసానికి వెళ్లారు. కూతురిని చదివించాలని తల్లికి ఎంత నచ్చజెప్పినా ఫలితం లేకపోయింది.

# ఆర్‌వీఆర్‌జేసీలో నూతన ఆవిష్కరణలపై సదస్సు

గుంటూరు రూరల్: విద్యార్థులు నిరంతర ఆవిష్కరణలు చేయాలని ఆర్‌వీఆర్ జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో సాఫ్ట్ స్కిల్స్, ఎంటర్ ప్రెన్యూర్‌షిప్‌పై సెమినార్ నిర్వహించారు. సెమినార్స్ వల్ల విద్యార్థుల్లో నూతన ఆలోచనా విధానాలు మెరుగుపడుతాయన్నారు. అమెరికాలోని క్లౌడ్ క్నోస్ సెక్యూరిటీ కంపెనీ సీఈఓ, వ్యవస్థాపకులు బాలాజీ పరిమి, జెన్‌పాక్ట్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రాజ్ సజ్జలు అతిథులుగా పాల్గొని, విద్యార్థులకు సందేశాన్ని అందించారు. సెమినార్‌లో కళాశాల విద్యార్థులు తయారు చేసిన కృత్రిమ అవయవాలను, వాటి పనితీరును, ప్రాముఖ్యతను వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ ఎంపీపీ చంద్రశేఖర్, డాక్టర్ స్వర్ణశ్రీ అతిథులను ఘనంగా సన్మానించారు.



అతిథులను సన్మానించిన కళాశాల యాజమాన్యం